దండేపల్లి : శోభాయాత్రలో భక్తుల కోలాటం

తాండూర్ : ఐబీలో వినాయకుడి వద్ద మహిళలు

సీసీసీ నస్పూర్ : నాగార్జునకాలనీలో కోలాటాల ప్రదర్శన

తాండూర్ : ఐబీ వద్ద యువకుల నృత్యాలు

కౌటాల మండలం ఎస్టీ కాలనీలో యువతీయువకుల నృత్యాలు

# వెళ్లిరా.. వినాయకా

- ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం
- వైభవంగా గణనాథుడి శోభాయాత్ర
- పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు..

భీమారం మండల కేంద్రంలో గణేశ్ శోభాయాత్రలో మంగళహారతులతో మహిళలు

దండేపల్లి/చెన్నూర్ టౌన్/శ్రీరాంపూర్/తాండూర్/కౌటాల/సీసీసీ నస్పూర్/మందమర్రి/కాసిపేట/లక్షెట్టిపేట/జైపూర్/ జైపూర్/హాజీపూర్/రెబ్బెన/బెజ్జూర్/దహెగాం/చింతలమానేపల్లి/ కన్నేపల్లి/జన్నారం/భీమారం/వేమనపల్లి, సెప్టెంబర్ 16 : వినాయక నవరాత్రోత్సవాలు సోమవారంతో ప్రశాంతంగా ముగిశాయి. తొమ్మిదిరోజులపాటు విశేషపూజలందుకున్న గణనాథులు.. గంగమ్మ ఒడికి చేరుకున్నారు. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో గణేశ్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఏకదంతుడిని ఉంచారు. అనంతరం మహిళల కోలాటాలు, యువతీ యువకుల నృత్యాల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు ఇంటింటా మంగళహారతులతో తరలివచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు. గణపతి బప్పా మోరయా.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయా చెరువులు, నదుల్లో నిమజ్జనం చేశారు. దండేపల్లి మండలం గూడెం గోదావరికి ప్రతిమలు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలతో పాటు మంచిర్యాల, మందమర్రి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి తీసుకువచ్చారు. గోదావరి వద్ద పోలీసులు, అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. క్రేన్ల సాయంతో నిమజ్జనం చేశారు. ఇక్కడ భారీ లైట్ సెట్టింగ్స్, భారికేడ్లు ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లు, సింగరేణి రెస్క్యూ టీంలను అందుబాటులో ఉంచారు. చెన్నూర్ పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర, నిమజ్జనం.. సోమవారం ఉదయం 10 గంటల వరకూ కొనసాగింది. స్థానిక పెద్ద చెరువులో సుమారు 20 విగ్రహాలను ఉదయమే నిమజ్జనం చేశారు. డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, పట్టణ సీఐ రవీందర్ ఏర్పాట్లను పరిశీలించారు. తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ.. భక్తజనంతో కిక్కిరిసిపోయింది. శోభాయాత్రలో అన్ని వినాయక మండళ్లవారు ప్రసాదాలు అందించారు. తాండూర్ సీఐ కే కుమారస్వామి ఆధ్వర్యంలో తాండూర్, మాదారం ఎస్ఐలు డీ కిరణ్‌కుమార్, సౌమ్య, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండపాల వద్ద కళశాలు, లడ్డూలు, బంగారు లక్ష్మి ప్రతిమలకు నిర్వాహకులు వేలం వేశారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్‌కాలనీ, సింగాపూర్, తాళ్లపల్లిలో, భగత్‌సింగ్‌నగర్, ఆర్కే-8 కాలనీ, ఆర్కే-6 గుడిసెలు, కొత్తరోడ్, ఆర్కే-6కాలనీ, కృష్ణకాలనీ, అరుణక్కనగర్‌లో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరాంపూర్ కాలనీలో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక గోదావరిలో నిమజ్జనం చేశారు. సీఐ మోహన్, ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌటాల మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయంలో గల వినాయకుడికి ప్రధాన అర్చకుడు అంబేద శంకరయ్య, సంతోష్

శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ కాలనీలో..

ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాలతో ఊరేగింపు ప్రారంభించారు. పట్టు పరిశ్రమ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. వినాయక కమిటీల ఆధ్వర్యంలో లక్కీ డ్రాలు, లడ్డూల వేలం నిర్వహించారు. ఎస్ఐ మధూకర్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీసీ నస్పూర్‌లో మండపాల సభ్యులు ఆయా వాడల్లో ఇంటింటికీ ప్రసాదం పంపిణీ చేశారు. సీఐ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మందమర్రి పట్టణంలోని వార్డులు, కాలనీల్లో వినాయక శోభాయాత్ర వైభవంగా సాగింది. మహిళలు మంగళహారతులతో గణనాథుడికి ప్రేడ్కోలు పలికారు. పాత బస్టాండ్ చౌరస్తాలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు వాహనాలకు స్వాగతం పలికారు. కాసిపేట మండలంలో నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ముత్యంపల్లి శ్రీ శివ సాయి గణేశ్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో వేల్పుల పోశం.. రూ.1,15,116కు లడ్డూ, కళశంను పుట్ట కుమార్ శేఖర్ రూ.55,016కు దక్కించుకున్నారు. లక్షెట్టిపేటలో పట్టణ సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ సతీశ్ పోలీసు బృందంతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో గోదావరి వద్ద ఏర్పాట్లు చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో లడ్డూను పట్టణానికి చెందిన ఫర్టిలైజర్ వ్యాపారి నరేందుల చంద్రశేఖర్ రూ.70,116కు దక్కించుకునానరు. జైపూర్ మండలం పారుపల్లి, జనగామ, బబ్బెరచెలుక, దేవులవాడ, సర్వాయిపేట, నక్కలపల్లి, పంగిడిసోమారం గ్రామాల్లో వినాయకులను ప్రాణహిత, గోదావరిలో నిమజ్జనం చేశారు. జైపూర్ మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో భజనలు, మహిళల కోలాటాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఎస్టీపీపీలో జీఎం రాజశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఇందారం గోదావరి వద్ద నస్పూర్, శ్రీరాంపూర్‌తో పాటు, జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల వినాయకులను నిమజ్జనం చేశారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్ఐ శ్రీధర్ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 16 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వాడ, బాపునగర్‌లో నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా మహిళలు ప్రత్యేక దుస్తులతో వచ్చి చేసిన కోలాటం ఎంతగానో ఆకట్టుకున్నది. సిర్పూర్(టీ) మండలం డౌనల్ ఏరియాలోని భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు పూజలు చేశారు. హాజీపూర్, రెబ్బెన, బెజ్జూర్, దహెగాం, చింతలమానేపల్లి, కన్నేపల్లి, భీమిని, జన్నారం, కెరమెరి, భీమారం, వేమనపల్లి మండలాల్లో నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

కోటపల్లి : బబ్బెరచెలుకలో అంబేద్కర్ యూత్..

దహెగాం : నృత్యం చేస్తున్న యువకులు

కాసిపేట : ముత్యంపల్లిలో రూ.1,15,116కు దక్కించుకున్న లడ్డూతో భక్తులు

వేమనపల్లి : జిల్లెడలో ఊరేగింపులో యువకులు..


చెన్నూర్ టౌన్ : వినాయక నిమజ్జనంలో ఉద్యోగులు, సిబ్బంది

లక్షెట్టిపేట : శోభాయాత్రలో మహిళలతో భజన బృందం

బెజ్జూర్ : శోభాయాత్రలో అంబాగట్ భక్తులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, SHAIK ASEEF, R/o. H.No. 1/1, Kokas Mannur, Adilabad District, Telangana-504 307, T.S. have Changed My Name to SHAIK ASIF S/o. Shaik Salar.
NT-335808

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
బిర్లా: 91827 77671, 91827 77677

## మూడు కిలోల గంజాయి పట్టివేత

జైనూర్, సెప్టెంబర్ 16 : జైనూర్ మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓ వాహనంలో మూడు కిలోల గంజాయి పట్టుబడినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. మహారాష్ట్రలోని జీవితి తాలూకా సేవ్‌గాంకు చెందిన నితిన్, లియాకత్, దేవురావ్ వాహనంలో మాలేగాంకు గంజాయి తరలిస్తున్నారని పేర్కొన్నారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 : బెల్లంపల్లి శాఖ గ్రంథాలయానికి విన్నర్స్ పబ్లికేషన్స్ అధినేత ప్రసన్న హరికృష్ణ పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. హరికృష్ణ పంపించిన పుస్తకాలను సోమవారం పోటీ పరీక్షల అభ్యర్థులకు అందించారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉప్పు గోపి, పోటీ పరీక్షల అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 16 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు చేపట్టనున్న సేవా పక్వాడా కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరావు తెలిపారు. 15 రోజుల పాటు ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు కొట్నాక విజయ్, కొంగ సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు.

## ఆశ్రమ పాఠశాలలో దోమల మందు పిచికారీ

ఆశ్రమ పాఠశాలలో దోమల మందు పిచికారీ చేస్తున్న కౌన్సిలర్, అధికారులు

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 16 : మంచిర్యాల పట్టణంలోని సాయికుంటలో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం వైద్యారోగ్యశాఖ సిబ్బందితో కలిసి ఐదో వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ దోమల నివారణ మందు పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయం, ముఖ్యంగా జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో ఆశ్రమ పాఠశాల ఆవరణలో దోమల నివారణ మందు పిచికారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి నాందేవ్, వార్డెన్ లక్ష్మీరాజం, మొండయ్య, అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొలవేణు మాధవరావు

వేమనపల్లి, సెప్టెంబర్ 16 : వేమనపల్లి మండలం కేంద్రంలోని వేమన యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. ఇందులో 27 జట్లు పాల్గొన్నాయి. భీమారం మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన జట్టు (ప్రథమ రూ.20వేలు), వేమనపల్లి మండలకేంద్రానికి చెందిన జట్టు (ద్వితీయ రూ.10వేలు) విజయం సాధించాయి. ఈ జట్లకు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కొలవేణు మాధవరావు అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ గుడి వెంకటేశం, సీనియర్ నాయకులు పీ లక్ష్మీకాంత్, కొండగొర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడికి 108 నైవేద్యాలు

108 నైవేద్యాలతో మహిళలు

దండేపల్లి, సెప్టెంబర్ 16 : దండేపల్లి మండల కేంద్రంలో శివగణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేశ్ మండపం వద్ద భక్తులు 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. స్వస్తిక్ ఆకారంలో దీపారాధన చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

దండేపల్లి, సెప్టెంబర్ 16 : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పాత రమేశ్‌ను దండేపల్లి మండల కేంద్రంలోని శివ గణేశ్ భక్త మండలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చీర్ల వెంకటేశ్వర్లు, తిరుపతి, గంగన్న, వేణు, రమేశ్, సతీశ్, ఉపాధ్యాయులున్నారు.

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గణేశ్ మండలి సభ్యులు

## 'వందేభారత్'కు హాల్టింగ్ ఇవ్వాలి

మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న సభ్యులు

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 16: నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య ప్రారంభమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం దక్షిణ మధ్య రైల్వే జీఎంకు రాసిన వినతి పత్రాన్ని స్టేషన్ అధికారులకు అందించారు. వీరికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మద్దతు పలికారు. మంచిర్యాల నుంచి నాగ్‌పూర్, సికింద్రాబాద్‌కు నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. హైస్పీడ్ రైలు సేవలు అందుబాటులో ఉంటే వ్యాపారులు, ఉద్యోగస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఇరుకుల్ల శ్రీనివాస్, సభ్యులు జుగల్‌కిషోర్, పురుషోత్తం జాజు, చంద్రశేఖర్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తిరుపతి

ఎస్ తిరుపతి

రెబ్బెన, సెప్టెంబర్ 16 : రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన ఎస్ తిరుపతి ఎన్నికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు స్వామి, ప్రధాన కార్యదర్శి రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అందులో తిరుపతికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. తన ఎంపికకు సహకరించిన ఆర్ నారాయణరెడ్డికి షార్ప్‌స్టార్ బాల్ బాడ్మింటన్ అసోసియేషన్, రాష్ట్ర అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## పరామర్శ

పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

దహెగాం, సెప్టెంబర్ 16 : మండల కేంద్రానికి చెందిన పుప్పాల శ్రీనివాస్ తండ్రి, సీనియర్ సిటిజన్ పుప్పాల రాజయ్య ఇటీవల మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోమవారం వేర్వేరుగా బాధిత కుటుంబానిన పరామర్శించారు. వారి వెంట జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు హర్షత్‌హుస్సేన్, చిలువేరు కమలాకర్, పిల్లల తిరుపతి తదితరులున్నారు

## దరఖాస్తుల గడువు పెంపు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 16 : కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 23 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పార్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 80 సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ముగియగా, విద్యాలయ సమితి గడువు పెంచినట్లు స్పష్టం చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష కోసం ఇప్పటి వరకు 3,312 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు స్పష్టం చేశారు. పెంచిన గడువును సద్వినియోగం చేసుకొని ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్నాన్న విద్యార్థులు సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లి, సెప్టెంబర్ 16 : మైనర్ బాలికను వేదించిన పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్పుల నవీన్, చిప్ప హరీశ్‌ను సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన 13 ఏండ్ల మైనర్ బాలిక బస్తీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమానికి వెళ్తుండగా, నవీన్, హరీశ్ అడ్డుకున్నారు. చేయి పట్టుకొని, రూ.500 చూపిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించారు. అక్కడే ఉన్న బాలిక చిన్నమ్మ కొడుకు చూసి, బలవంతంగా విడిపించుకొని తీసుకొచ్చాడు. విషయాన్ని తల్లితో చెప్పింది. వెంటనే బాధితురాలి తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహేందర్ వెల్లడించారు.

## విఘాతం కలిగిస్తే చర్యలు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 16 : మంచిర్యాల పట్టణంలో మంగళవారం నిర్వహించే గణేశ్ నిమజ్జన శోభాయాత్రను గణేశ్ నిర్వాహక కమిటీ సభ్యులు ప్రశాంతంగా జరుపుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని మంచిర్యాల సీఐ బన్సీలాల్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో పలు మండపాలను సోమవారం సందర్శించారు. గతేడాది నిమజ్జనం సందర్భంగా గొడవలకు పాల్పడిన హమాలీవాడ, మజీద్ వాడకు చెందిన ఆరుగురు ట్రబుల్ మాంగర్స్, నలుగురు రౌడీ షీటర్స్‌ను ముందస్తు చర్యలో భాగంగా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

## చెరువులో పడి ఒకరి మృతి

కొంపరి కిరణ్ (ఫైల్)

చింతలమానేపల్లి, సెప్టెంబర్ 16 : మండల కేంద్రానికి చెందిన కొంపరి కిరణ్ (28) స్థానిక పోచమ్మ చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ తెలిపారు. కొంపరి కిరణ్ కొద్దిరోజులుగా మతిస్థిమితి కోల్పోయి తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కాగా, సోమవారం ఊరి సమీపంలోని పోచమ్మ చెరువులో మృతదేహం కనిపించింది. తండ్రి కొంపరి సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.